క్లుప్తంగా

గడప గడపకు మన ప్రభుత్వం రేపు

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో 8, 9 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో పశువులను సంరక్షించుకోవాలి

పుంగనూరు: వేసవికాలం తీవ్రంగా ఉండడంతో పాడి పశువులను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని వెటర్నరీ ఏడీ మనోహర్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని బాలగురవయ్యగారిపల్లెలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

నైతిక విలువలను నేర్పాలి



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో నయీమ్‌అలీ

పలమనేరు: పిల్లలకు చదువుతో పాటు నైతిక విలువలను నేర్పాల్సిన బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందని పలమనేరు ఎఫ్‌ఆర్వో నయీమ్ అలీ అన్నారు. సంబార్‌పూర్ గ్రామ ఎంపీపీ పాఠశాలలో గురువారం జరిగిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలు, చదువులో రాణించిన పిల్లలకు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎస్‌బీటీ ప్రేమలత, సర్పంచ్ హంసవేణి, పాఠశాల కమిటీ చైర్మన్ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు గ్రామ సచివాలయాన్ని గురువారం తహసీల్దార్ హనుమంతు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు పట్టిక, రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెద్దపంజాణి ఉన్నత పాఠశాలలోని పది పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

పలమనేరు: తల్లిదండ్రులనుంచి తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట గురువారం స్థానిక డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని ఆశ్రయించారు. పంద్యాలమడుగుకు చెందిన వెంకటాచలం కుమార్తె సుహిత, చింతలగుంటకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు హరీష్ ఇటీవల ప్రేమపెళ్లి చేసుకున్నట్టు తెలిపారు. తాము మేజర్లమని కానీ ఇరు కుటుంబాలనుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కోరి డీఎస్పీ కార్యాలయానికి వచ్చినట్టు పేర్కొన్నారు.

విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా జగదీష్



కుప్పంరూరల్: ద్రావిడ విశ్వవిద్యాలయం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చీలేపల్లి రవి తెలిపారు. గురువారం వర్సిటీ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జగదీష్, ఉపాధ్యక్షులుగా సంజురెడ్డి, బాబు, ప్రధాన కార్యదర్శులుగా బాలాజి, నరసింహులు, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరితో పాటు మరో 14 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల్లోని న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. నూఢిల్లీలో విరేంద్రకుమార్ అనే న్యాయవాది హత్యను నిరసిస్తూ విధులు బహిష్కరించారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు పాల్గొన్నారు.

వైభవం రథోత్సవం



బైరెడ్డిపల్లెలో రథాన్ని లాగుతున్న భక్తులు

బైరెడ్డిపల్లె: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మరథంపై సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం భక్తులు రథాన్ని లాగి మొక్కు తీర్చుకున్నారు. సోమేశ్వరస్వామి రథోత్సవం కోలాహలంగా సాగింది.

ఘర్షణ - ఒకరికి కత్తిపోట్లు

గుడుపల్లె: గోవిందపల్లెలో కుటుంబ కలహాలతో గురువారం ఘర్షణ జరిగింది. ఒకరు కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడ్డారు. గోవిందపల్లెకు చెందిన లీలావినోద్ తండ్రి రామప్ప నాలుగు రోజుల కిందట మృతి చెందాడు. తన తండ్రి పెద్దనాన్న కుమారుడు గణేష్ వల్లె చనిపోయాడని లీలా వినోద్‌కు అనుమానం వచ్చి ఇరువురూ గొడవ పడ్డారు. గణేష్‌పై లీలా వినోద్ కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన గణేష్ భార్య సుగుణ, కుమారుడు వేణుపై కూడా దాడి చేశాడు.

దుంప తెంచిన బంగాళాదుంప

- భారీగా ధరలు పతనం
- ఎకరాకు రూ. లక్ష దాకా నష్టం
- కొనేవారు లేక దుంపను వదిలేస్తున్న రైతులు
- ఐదు రాష్ట్రాల సరుకే కారణమా



కురప్పల్లి వద్ద బంగాళాదుంప సాగు



పొలాల వద్ద నిల్వ ఉంచిన దుంపలు

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల్లో మాత్రమే సాగయ్యే పంట బంగాళాదుంప. ఇక్కడి శీతల వాతావరణం కారణంగా, ఎర్రటి నేలలతో ఈ పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు ఆలుగడ్డ సాగును ఎంతో ఆసక్తిగా సాగుచేస్తుంటారు. బంగాళాదుంప సాగులో లక్షాధికారులైన రైతులు ఈ ప్రాంతంలో ఉన్నారు. కానీ ఈదఫా బంగాళాదుంపను సాగుచేసిన రైతులకు నష్టాలు తప్పలేదు. వర్షాలు విస్తారంగా కురిసి బీడు భూములు సైతం పంటల సాగుతో కలకలలాడుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో కూరగాయల పంటల సాగు గతంలో ఎన్నడూలేని విధంగా పెరిగింది. పంట చేతికొచ్చే సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి బంగాళాదుంపలు మార్కెట్లకు చేరడంతో ధరలు అమాంతం తగ్గాయి. దీంతో లక్షలు పెట్టుబడిగా పెట్టిన రైతులకు ఈ దఫా నష్టాలు తప్పలేదు.

పెరిగిన బంగాళాదుంప సాగు..

ఏటా ఈ ప్రాంతంలో ఆగస్టు, నవంబర్, జనవరి నెలల్లో బంగాళాదుంపను సాగుచేస్తుంటారు. ఈ నెలలలో ఇక్కడి సాధారణ సాగు 2,650 హెక్టార్లు కాగా ఈదఫా మూడు వేల హెక్టార్లలో దుంపను సాగుచేశారు. వర్షాల కారణంగా కొన్ని తోటలు దెబ్బతిన్నప్పటికీ మెట్టప్రాంతంలోని పొలాల్లో మంచి దిగుబడులు వచ్చాయి. అయితే బంగాళాదుంపను సాగుచేసే రాష్ట్రాల్లో పంజాబ్, హరియానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక నుంచి సరుకు చెన్నై మార్కెట్‌కు చేరడంతో స్థానిక రైతులకు ధర లేకుండా పోయింది.

ఇదిగో సాక్ష్యం...

నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం మిట్టకురప్పల్లికి చెందిన నాగభూషణం బంగాళాదుంప సాగులో ముందుంటాడు. జనవరిలో దుంపను ఎకరన్నర పొలంలో సాగుచేశాడు. పంట పెట్టుబడిగా రూ.1.60 లక్షలు ఖర్చు బెట్టాడు. పంట దిగుబడి బాగానే వచ్చింది. పంట ఒబ్బిడి చేయగా అతని పొలంలో 300 బస్తాలు(బస్తా 42 కేజీలు) దిగుబడి వచ్చింది. ప్రస్తుతం బస్తా ధర రూ.200గా ఉంది. దీంతో అతనికి రూ.60 వేలు రాగా ఖర్చు మొత్తం రూ.1.60 రైతుకొచ్చిన నష్టం లక్షగా ఉంది. గతంలో బస్తా రూ.1500 నుంచి 2వేలదాకా ధర పలికిన సందర్భాలున్నాయి. అయితే ఈసారి బస్తా ధర రూ.200 పలకడం లేదు.

మూడేళ్లుగా నష్టాలే..



నేను ఈ దఫా ఒకటిన్నర ఎకరాలో బంగాళాదుంప సాగుచేశా. పంట పెట్టుబడిగా రూ.1.60 లక్షలు పెట్టా. పంట బాగా వచ్చింది. 300 బస్తాలు వచ్చాయి. తీరా ఇప్పుడు ధర చూస్తే తుండు(42 కేజీలు) రూ.200 కూడా లేదు. ఈ ధరతో అమ్మకాలు చేసినా నాకొచ్చేది రూ.60వేలు మాత్రమే. దీంతో నా కష్టంపోనూ లక్షదాకా నష్టం వచ్చింది.

–నాగభూషణం, బంగాళాదుంప రైతు, మిట్టకురప్పల్లి

తెలివిగా పంటలు సాగుచేయాలి..



బంగాళాదుంప సాగు ఈ ప్రాంత రైతులు లాభసాటిగానే ఉండేది. అయితే ఈ దఫా దుంపలను సాగుచేసే పలు రాష్ట్రాల నుంచి సరుకు మార్కెట్లకు రావడంతో ధర తగ్గిన మాట నిజమే.అందుకే రైతులు మార్కెట్‌ను బట్టి ఏ పంటను సాగు చేయాలో ఆలోచించి పంటలేయాలి. డిమాండ్ ఎక్కువగా ఉంటే ధరలు బాగుంటాయి. సప్లై ఎక్కువగా ఉంటే ధరలుండవనే విషయాన్ని గమనించాలి.

–డా.కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్యం

- చిత్తూరు ఎమ్మెల్సీ భరత్



104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం కుప్పం మండలం, మాల్లానూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి 104 వాహనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుండాలంటే విద్య, ఆరోగ్యం ముఖ్యమని అన్నారు. ఈ రెండు విభాగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇప్పుడు 'ఫ్యామిలీ డాక్టర్' తెచ్చి పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నారని అన్నారు. ఇళ్ల వద్దకే డాక్టర్లను తెప్పిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, నేతలు మురుగేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రచారం చేస్తున్న బ్యాంకు అధికారులు

బైరెడ్డిపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ధనవృద్ధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బైరెడ్డిపల్లె బ్రాంచ్ మేనేజర్ వినోద్ కోరారు. ఈ పథకంలో సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం, ఇతరులకు 7.5 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శోభ పేర్కొన్నారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 5వ తరగతి, 6వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 7వ తరగతి ప్రవేశానికి అర్హులన్నారు. దరఖాస్తులు ఏప్రిల్ 24 తేదీ లోపు వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 20న జిల్లా ప్రధాన కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి జగనన్నే మా భవిష్యత్తు

పలమనేరు: నేటి నుంచి పలమనేరు మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజీనాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని కరిడిమొడుగు గ్రామ గృహసారథులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ఈనెల 20 దాకా జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి అందిన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా గత టీడీపీ పాలనకు నేటి జగనన్న ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్నే మా భవిష్యత్తు ప్రారంభం

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మనఅలీమ్‌బాషా తెలిపారు. గురువారం మున్సిపాలిటీలో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ కలిసి కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులతో కలిసి పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీలో ఉదయం 9 గంటలకు మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అత్యధిక మెజార్టీ లక్ష్యం

సోమల: మండలంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజారిటీ లక్ష్యంగా అందరూ పనిచేయాలని మాజీ ఏఎంసీ చైర్మన్ అమాసమోహన్ సూచించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతానికి 13 సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ నాగభూషణంరెడ్డి, వైస్ ఎంపీపీలు సయ్యద్‌బాషా, ప్రభాకర, నేతలు సాంబశివయ్య, సరస్వతమ్మ, సర్పంచ్ వెంకటరమణ, వాటర్‌షెడ్ చైర్మన్ డిసెంబరరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై సూచనలు

రామకుప్పం: మండలంలోని బల్దారు, పెద్దగెరిగపల్లి, గొరివిమాకులపల్లిలో జాతీయ ఆహార భద్రత మిషన్(ఎన్‌ఎఫ్ఎస్ఎం)పథకంలో భాగంగా రైతులు పండించిన రాగి క్షేత్రాలను గురువారం జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడారు. చిరుధాన్యాల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా చిరుధాన్యాల ప్రాముఖ్యత, విలువలను రైతులకు వివరించారు. క్యాబేజీ,మిరప పంటలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. మండల వ్యవసాయాధికారి అమృత, ఎంపీఈఓ అమరేష్, పరమేష్, రామచంద్ర పాల్గొన్నారు.


ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం




పెద్దపంజాణి: ప్రారంభిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప



సోమలలో..



గంగవరంలో..



సదుంలో..



రామకుప్పంలో..



చౌడేపల్లెలో..



కడపనత్తంలో..



వి.కోటలో..

పెద్దపంజాణి: ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఎస్. రెడ్డెప్ప చెప్పారు. గురువారం పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం పరిధిలోని చలమంగళం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డా. మురళి, సీహెచ్‌ఓ కరుణాకర్, వైఎస్సార్‌సీపీ నేతలు లతీఫ్, సన్నప రెడ్డి పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: గంగవరంలో 104 రెండు వాహనాలను పత్తికొండ పీహెచ్‌సీ, కల్లుపల్లి పంచాయతీలకు కేటాయించారు. కల్లుపల్లి పంచాయతీకి కేటాయించిన 104 వాహనాన్ని ఎంపీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ప్రహ్లాద, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, వైస్ ఎంపీపీ ఉమాదేవి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నేతలు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, బాలక్రిష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, పట్టాభిరామయ్య, గోపిక్రిష్ణ, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: ఆవులపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరండాక్టర్ రమ్యశ్రీ, వైస్ ఎంపీపీ ప్రభాకర, జేసీఎస్ మండల కన్వీనర్ మధు, సర్పంచ్ కోదండరాజు, ఎంపీటీసీ అపరాజిత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: నడిగడ్డలో ప్రారంభించారు. ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, డాక్టర్లు గిరీషా, చరణ్, నేతలు పుట్రాజు, నాగభూషణంరెడ్డి, సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

రామకుప్పం: చెల్దిగానిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్‌ను ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యులు దీప, అల్తాఫ్ హుస్సేన్, శశిధర్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: చారాల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్, సర్పంచ్ విజయకుమారి, ఎంపీటీసీ మునెమ్మ, డాక్టర్‌లు పవన్, నవీన్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: కడపనత్తంలో ప్రారంభించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడ్, విమల, వైద్యులు విజయ్‌చంద్ర, షాలిని పాల్గొన్నారు.

వి.కోట: ఒగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బోయచిన్నాగనపల్లిలో ఫ్యామిలీ డాక్టర్‌ను ఎంపీపీ యువరాజు ప్రారంభించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



సదుం: ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- మహిళాభ్యున్నతికి సీఎం నిరంతర కృషి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సదుంలో ఆసరా చెక్కుల పంపిణీ

సదుం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీపీ ఎల్లప్ప అధ్యక్షతన గురువారం మూడవ విడత ఆసరా కింద 746 ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని 6531 సభ్యులకు రూ.8.23 కోట్ల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 98.44 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా పేదరికమే కొలమానంగా పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు సొంత జిల్లాకు పట్టించుకోలేదని ఆరోపించారు. చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారని చెప్పారు. రూ.14 వేల కోట్ల అప్పు కాస్తా రూ. 26 వేల కోట్లు అయ్యిందన్నారు. ఈనేపథ్యంలోనే ఆసరా పథకం ద్వారా సీఎం మహిళలకు అండగా నిలిచారని చెప్పారు. జిల్లాకు రూ. 2,400 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును సీఎం మంజూరు చేశారని, టెండర్లను కూడా పిలిచినట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని, మైనారిటీలకు షాదిమహల్ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ద్వారా రూ. 6.5 కోట్ల నిధిని ఏర్పాటు చేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. స్థానికంగా యాభై పడకల ఆస్పత్రి, పలు మార్గాలో వర్ష సమయాల్లో ప్రయాణాలకు ఆటంకం లేకుండా వంతెనలు నిర్మిస్తున్నామని చెప్పారు. 45 సంవత్సరాలుగా తమకు అండగా ఉంటున్న ప్రజల రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. అంతకు ముందు దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై స్కూటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం





పులిచెర్లలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం, రొంపిచెర్లలో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభిస్తున్న మంత్రి

పులిచెర్ల(కల్లూరు): మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి మహిళలను అన్ని విధాలా ఆదుకోవడం కోసం ఆసరా, చేయూత పథకాలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం స్వయం సహాయక సంఘ మహిళలకు ఆసరా చెక్కు అందజేసే కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ ఆసరా మూడవ విడతలో మండలంలో 963 సంఘాలకు రూ.11.74 కోట్లు వారి ఖాతాల్లో జమచేశారని తెలిపారు. రైతుమిత్ర గ్రూపులకు మంజూరైన ట్రాక్టర్లను, వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఆసరా మెగా చెక్కును స్వయం సహాయక సంఘ సభ్యులకు అందజేసిన అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జింకా చలపతి, జెడ్పీటీసీ మురళీధర్, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, విరూపాక్షి జయచంద్రారెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, నాథమునిరెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కిట్లు పంపిణీ చేస్తున్న నేతలు

రామకుప్పం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి అన్నారు. గురువారం ఆకందగానిపల్లిలో మండల స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరించాలన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్ల పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సుగుణప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

కుప్పంలో అభివృద్ధి శూన్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

సదుం: సీఎంగా ఉండి చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని సైతం అభివృద్ధి చేసుకోలేకపోయారని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఉపాధి లేక నిత్యం రైళ్లలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండడం తాను గమనించానని చెప్పారు. చంద్రబాబుకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు మండలంలో విజయవంతం చేయాలని నాయకులకు ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సూచించారు. మా నమ్మకం నువ్వే జగన్ ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న యాభై పడకల ఆస్పత్రిని ఆయన పరిశీలించారు. ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, గురుకిరణ్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.


జగనన్నే మా భవిష్యత్తును విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న కోదండరెడ్డి

శాంతిపురం: నేటి నుంచి ఈనెల 14 వరకూ జరగనున్న 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, నేతలతో సమావేశమయ్యారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సొన్నేగానిపల్లిలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని, మిగతా పంచాయతీలలో కూడా చేపట్టాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, చక్రపాణిరెడ్డి, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడు, కోఆప్షన్ సభ్యుడు నిసార్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకం



నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ సీఈఓ

రొంపిచెర్ల: అనారోగ్యంతో మృతిచెందిన ఉపాధ్యాయుడు సదరుద్దీన్ భార్య తస్లీంకు గురువారం కారుణ్య కింద టైపిస్ట్‌గా నియామక పత్రాలను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. ఐదు నెలల కిందట రామచంద్రాపురంకాలనీ ఉపాధ్యాయుడు సదరుద్దీన్ అనారోగ్యంతో మృతిచెందారు. తమను ఆదుకోవాలని మృతుని కుటుంబం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వేడుకుంది. మంత్రి స్పందించి కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో తస్లీం టైపిస్ట్‌గా ఉద్యోగం లభించింది. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన పంచాయతీ కార్యదర్శి సుభాన్ భార్యకు కూడా కారుణ్య నియామకం కింద త్వరలోనే ఉద్యోగం ఇస్తామని సీఈఓ తెలియజేశారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.